క్లుప్తంగా

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తజనంతో ఆదివారం రద్దీగా మారింది. తెల్లవారుజాము నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఎటు చూసినా భక్తజనంతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ తల్లి జాతర



అన్నవరం–చిర్లపాలెం(మోపిదేవి): మండలంలోని అన్నవరం–చిర్లపాలెం గ్రామంలో శ్రీ మారెమ్మ తల్లి జాతర ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం మూకుమ్మడిగా డప్పుకళాకారుల సందడి మధ్య తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా బంధుమిత్రులతో రాకతో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం ఉదయం స్వామి వారిని పెండ్లికుమరుడిగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంగానమ్మకు మొక్కుల చెల్లింపు



నాగాయలంక: గ్రామంలో కొలువైన తలశిల వంశీయుల ఇలవేల్పు గంగానమ్మ తల్లి ఆలయంలో 22వ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. శనివారం రాత్రంతా ఘటాల గ్రామోత్సవం జరిపారు. వేకువ జామున గుడికి చేరిన అనంతరం ఉదయం 7గంటలకు ఆలయ ప్రాంగణంలోని శ్రీపోతురాజుస్వామికి నైవేద్యం సమర్పించారు. తదుపరి ఆలయ జాతర సంప్రదాయం మేరకు తలశిల ఆడపడుచులు అమ్మవారికి పసుపు, కుంకుమ, పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా 2500 మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు తలశిల శ్రీనివాసరావు, తలశిల నవీన్, తలశిల వంశీయులు, గ్రామ ప్రముఖులు, ఆడపడుచులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కొనకళ్లకు పేర్ని నాని పరామర్శ



మచిలీపట్నంటౌన్: గుండె సంబంధ ఇబ్బందితో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) ఆదివారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. మంచి ఆరోగ్యంతో ఇంటికి రావాలని, ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే పేర్నినాని ఆకాంక్షించారు. నారాయణరావు సోదరుడు బుల్లయ్యను పేర్నినాని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి

చల్లపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడిగా కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య సేవలు చిరస్మరణీయమని సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు అన్నారు. ఆదివారం స్థానిక గుంటూరు బాపనయ్య భవన్‌లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరిముల్లా, నాయకులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు కోడ్ అడ్డంకి

- కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో జాప్యం
- ఖరీఫ్ సీజన్‌కు ముందు నుంచే కార్డుల జారీ చేయాల్సి ఉంది
- గత ఏడాదిలో ఇప్పటికే మొదలు.. 11 నెలల కాలపరిమితితో అందజేత



PEDANA
శ్రీ పరసా బ్రహ్మయ్య శాస్త్రి S/o ... నివాసం Hyderabad (భూ యజమాని) మరియు శ్రీ PARASA KUTUMBA RAO S/o Brahmaiah sastry (సాగుదారు) నివాసం 15/39,NANDAMURU,PEDANA,KRISHNA మధ్య ఈ క్రింది దాఖలా భూమి పై (03/07/2023) నుండి (03/05/2024) వరకు 10 నెలల కాలపరిమితితో కుదిరిన ఒప్పందం పత్రం.
సాగుదారు ఆధార్ నెంబర్ : 933710436286
మొబైల్ నెంబర్ : 9347721179
లింగం : Male
కులం : BC

కౌలురైతుకు ఇచ్చే సాగుదారు కార్డు

పెడన: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో జాప్యం నెలకొంది. గత ఏడాది ఇప్పటికే ఈ కార్డులు జారీకి వ్యవసాయశాఖ సిద్ధమవగా ఇప్పుడు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఈ కోడ్ జూన్ 6వ తేదీ వరకు ఉండటంతో జూన్ ఆరో తేదీ తరువాత కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీకి చర్యలు చేపట్టేలా అధికారులు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం–2019 భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా సాగు చేసే కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సమయంలో వారికి సాగుదారు కార్డులిచ్చి ఆర్థికంగా చేయూత అందించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంట సాగుదారుల హక్కుల చట్టం తెచ్చింది. ఈ కార్డుపై సంతకం చేయడం వలన భూ యజమానులకు, వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలుగకుండా 1956 రక్షిత కౌలు దారి చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టంలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంది. ఈ చట్టం విషయంలో భూ యజమానులు నిశ్చింతగా ఉండొచ్చని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం అమల్లో భూ యజమానులు, కౌలు రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, గ్రామ వలంటీర్లు, వీఆర్వోలు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. సాగుదారులకు ఇది ఒక ముఖ్యమైన భరోసాగా నిలుస్తోంది.

సాగుకార్డు పొందడం ఎలా..

సాగుదారు కార్డు భూ యాజమానికి, సాగు చేస్తున్న రైతుకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డు పైన భూ యజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో, ఆథరైజ్డ్ ఆఫీసర్) ఈ ముగ్గురి సంతకాలు ఉండాలి. పంట సాగుదారు కార్డు కాల పరిమితి 11 నెలలు మాత్రమే. 11 నెలల తరువాత సాగుదారులు మళ్లీ కొత్త కార్డు పొందాలి. గ్రామ వలంటీరు ద్వారా తమకు దగ్గరలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించడం, తద్వారా వీఏఏను కలిసి కార్డుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. సాగుదారు కార్డు పొందిన వారికి ఆ భూమిపై ఎటువంటి హక్కులు రావు. కేవలం పంట రుణాలు, పంట బీమా, సబ్సిడీలు వంటివి పొందడానికి మాత్రమే ఈ కార్డు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి పంట రుణం తీసుకుంటే, దానిని తిరిగి చెల్లించే బాధ్యత పూర్తిగా సాగుదారునిపైనే ఉంటుంది. ఏ కారణం వల్లనైనా చెల్లించలేకపోతే భూ యజమానిపై కాని లేదా ఆ భూమి పైన కానీ ఎటువంటి భారం భవిష్యత్తులో ఉండదు.

నియోజకవర్గ వ్యాప్తంగా 7,089 సాగు కార్డులు

పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 112 గ్రామాల్లోని 2022 ఖరీఫ్ సీజన్‌లో 7,089 మందికి సాగుకార్డులను జారీ చేశారు. 2023 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అంటే మే నుంచి కార్డులను జారీ చేశారు. 6,588 కార్డులకు పైగా జారీ చేశారు. నిరుడు జూలై ప్రారంభం నుంచి జరిగిన ప్రత్యేక క్యాంపుల ద్వారా కూడా చాలా మంది కౌలు రైతులకు సాగుదారు కార్డులను మంజూరు చేశారు. గత మూడేళ్ల నుంచి సాగుకార్డులు పొందుతున్న వారిని బట్టి అవగాహన లేక భూ యజమానులు సహకారం ఇవ్వకపోవడంతో వారిని చైతన్య పరుస్తుండటంతో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.

పెడన నియోజకవర్గంలోని మండలాల వారీగా గత రెండేళ్లుగా సాగు కార్డులను పరిశీలిస్తే..

మండలం	2022	2023
బంటుమిల్లి	1,365	1,218
కృత్తివెన్ను	1,015	920
గూడూరు	2,212	2,071
పెడన	2,497	2,379
	7,089	6,588

ఎన్నికల కోడ్ ఉంది..



కౌలు రైతులకు సాగుకార్డులు జారీ విషయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. గత ఏడాది మే నుంచి ఈ సాగుకార్డులు జారీ చేశాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల సాగుకార్డుల జారీకి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం. ఆదేశాలు వస్తే ఆర్‌బీకేల పరిధిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తాం. భూమిపై కౌలు రైతులకు ఎటువంటి హక్కులుండవని తెలియజేస్తాం. పంట రుణాలు తీసుకున్నా మీరు ఎటువంటి సంతకాలు చేయనక్కరలేదని, కేవలం కౌలు కార్డుపైన చేస్తే సరిపోతుందనే విషయాన్ని అర్థమయ్యేలా చెబుతాం.

–జీవీ శ్రీనివాసరావు, ఏవో, పెడన మండలం

కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెలకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలో అత్యంత ప్రాచీన చారిత్రిక ప్రసిద్ధిగల శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు ఆదివారం ఉదయం సుముహూర్త సమయం 8గంటలకు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రధాన అర్చకులు పంచాంగం రమణాచార్యులు, కందూరి శ్రీనివాసాచార్యుల అర్చకత్వంలో వంశపారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది లోకేశ్వరరావు జంటలు పీటలపై కూర్చుని పూజాధికములు జరిపారు. మొదటిరోజు సంప్రదాయం ప్రకారం విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాకీవరచనము, రక్షాబంధం, రుత్విగ్వరణం, ముత్యం గ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అర్చకుడు రమణాచార్యులు మాట్లాడుతూ సోమవారం హోమాలు, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ 21న నిత్య హోమం, జగజ్యోతి, 22న రాత్రి ఎదుర్కోలు వేడుక, కల్యాణ మహోత్సవం జరుగుతాయని వివరించారు. ధర్మకర్తల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక..



2000-2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

- 23 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు
- ఉపాధ్యాయులకు పాదపూజ, సత్కారాలు

కోడూరు: 'ఏరా బావ.. ఏం చేస్తున్నావ్.. ఎక్కడ ఉంటున్నావు.. అమ్మానాన్న బాగున్నారా.. పిల్లలు ఏలా ఉన్నారు..' అంటూ పూర్వ విద్యార్థుల ఆప్యాయ పలకరింపులకు కోడూరు దానాశక్తి ఆర్య వైశ్య కల్యాణ మండపం వేదికగా మారింది. కోడూరులోని బాలభాను విద్యాలయంలో 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 23 ఏళ్ల తరువాత విద్యార్థులంతా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులపై వేసిన చలోక్తులు, గురువులు వేసిన శిక్షలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. ప్రస్తుతం తాము స్థిరపడిన ఉద్యోగాలను వివరించడంతో పాటు కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. వీరికి విద్యా బోధన చేసిన గురువులు పాగోలు మురళీకృష్ణ, పాగోలు మహేశ్వరరావు, మెండు ఉమామహేశ్వరరావు, లక్ష్మి, హుస్సేన్, శివప్రసాద్, చంద్రశేఖర్‌లకు విద్యార్థులు పాదపూజ చేసి దుశ్శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవీ మాతకు కుంకుమ పూజలు



వాసవీ మాత ఆలయంలో పిండి జ్యోతులతో హారతులు ఇస్తున్న వాసవి మండలి మహిళలు

పెడన: శ్రీవాసవీ మాత జయంతి మహోత్సవాలను స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఆదివారంతో ఈ ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీ మాత జయంతిని పురస్కరించుకొని పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం శ్రీవాసవి మాతకు లక్ష కుంకుమార్చన పూజ కార్యక్రమాన్ని 50 మంది మహిళలతో ఆలయ ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబు నిర్వహింపజేశారు. పట్టణ శ్రీ వాసవీ మహిళా మండలి నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృతం, సహస్ర దీపాల అలంకరణ పలువురు భక్తులను ఎంతగానో ఆకర్షించింది. పెడన పట్టణం, పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయ దాతులైన పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం వారు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శనివారం రాత్రి పట్టణ శ్రీవాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో వందమంది మహిళలు శ్రీ వాసవీ మాతకు పిండి జ్యోతులతో హారతులిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు పాల్గొని పర్యవేక్షించారు.

కంటి ఆపరేషన్లకు 110 మంది ఎంపిక



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్లు సుభాష్, ఆదిత్య, పాల్గొన్న అతిథులు, ప్రతినిధులు

నాగాయలంక: అంధత్వ నివారణే లక్ష్యంగా సుదర్శి మానవతా సేవాసంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 42వ ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యుడు, 44 పర్యాయాల రక్తదాత సింహాద్రి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దాతల ఔదార్యంతో ఇప్పటికి ఏడు వేల మందికి కంటి పరీక్షలు జరిపించి వీరిలో 5,600 మందికి ఐఓఎల్ శస్త్రచికిత్సలు ఉచితంగా చేయించడం గొప్ప పరిణామమని సంస్థ కృషిని అభినందించారు. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి వెంకయ్య /జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ ప్రాంగణంలో జరిపిన శిబిరంలో 135 మందికి పరీక్షలు చేయగా 110 మందికి ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్రచికిత్సలకై బస్సులో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ద్వారా పంపించారు. డాక్టర్ సుభాష్, డాక్టర్ ఆదిత్య నేత్ర పరీక్షలు జరిపారు. ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు, కనిగంటి వెంకటనారాయణ, షేక్ మస్తాన్, జమీలామస్తాన్, మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గూడూరు: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గూడూరులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఏటా కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా వేసవి శిబిరం కొనసాగుతుందన్నారు.

కమనీయం.. గోకర్ణేశ్వరుడి కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న ఉభయదాతలు, పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

- నందీశ్వరుడిపై ఊరేగిన కల్యాణ మూర్తులు
- అశేషంగా పాల్గొన్న భక్తజనం

కోడూరు: దివిసీమలో అతి పురాతనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, భక్తుల శివనామస్మరణ మధ్య శనివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో అమ్మవార్లను, నందీశ్వరుడిపై స్వామివారిని కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చి మచిలీపట్నంకు చెందిన పండితులచే కల్యాణతంతును నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కొత్తలంక జగన్నాథశర్మ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ సుధాకర్ స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేసి, జగజ్యోతిని వెలిగించారు. కల్యాణంలో పాల్గొన్న మహిళలకు రవిక, గాజులు, కుంకుమను దేవాదాయ అధికారులు అందించారు. గర్భాలయంలోని గోకర్ణేశ్వరుడి మూలమూర్తికి రుద్రాభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

కల్యాణమూర్తులకు గ్రామోత్సవం..

కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిలో నందీశ్వరుడిపై కల్యాణమూర్తులను లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి గ్రామంలో ఊరేగించారు. ఉదయం గోకర్ణేశ్వరస్వామివారి లింగాకారుడికి పంచామృతాభిషేకం చేసి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం వద్ద మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ సుధాకర్, జేఏ చిట్టిప్రోలు శివప్రసాద్, దాసరి గిరిబాబులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఖాళీ బాటిల్స్‌లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు



సీఐ ఏసుబాబు

గుడివాడరూరల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో గుడివాడ తాలూకా సర్కిల్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంకుల యజమానులు ఖాళీ బాటిల్స్‌లో పెట్రోలు ఇవ్వవద్దని గుడివాడ తాలూకా సీఐ కె.ఏసుబాబు పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ తాలూకా పరిధిలోని నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ మండలాల్లోని పెట్రోల్ బంకుల యజమానులు ఖాళీ బాటిల్స్, డబ్బాల్లో పెట్రోలు ఇవ్వొద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పెట్రోల్ బంకుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో ఉన్న కిరాణా షాపుల వద్ద లూజు పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేయరాదన్నారు. అలా కాకుండా ఎవరైనా అమ్మకాలు చేస్తే సంబంధిత గ్రామాల్లోని ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బంకుల యజమానులతో పాటు, కిరాణా షాపుల యజమానులు కూడా పోలీసుల నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



వన్‌టౌన్ సీఐ ఇంద్రశ్రీనివాస్

గుడివాడరూరల్: గుడివాడలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని వన్‌టౌన్ సీఐ కె.ఇంద్రశ్రీనివాస్ తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన గొర్ల రామారావు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నాడని తమకు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 11వ తేదీన రామారావును అదుపులోకి తీసుకుని విచారించగా తనతో పాటు కె.కుమార్ అనే వ్యక్తి కూడా టికెట్లు విక్రయిస్తున్నట్లు తెలిపాడన్నారు. ఈ క్రమంలో కుమార్ కోసం గాలింపు చేపట్టి ఆదివారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వీరిద్దరిని బైండోవర్ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లాటరీ టికెట్లు, గంజాయి, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే స్థానికులు తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జూదాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ స్పష్టం చేశారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

పమిడిముక్కల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఐనంపూడిలో శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం, గ్రామంలోని విశ్రాంత ఉద్యోగులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన లక్ష్మీప్రియాంకకు రూ.5 వేలు, బొల్లా మోహన అనుకు రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు.

పది ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం

చల్లపల్లి: చల్లపల్లి ఎస్సీ కాలనీలో వరిగడ్డి వామి దగ్ధమైంది. ఆదివారం తెల్లవారు జామున స్థానిక ఎస్సీ కాలనీలో కొడాలి సురేష్ అనే పశుపోషకుడికి చెందిన పది ఎకరాల వరిగడ్డి వామి అగ్ని ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మధ్యాహ్నం వరకు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బాధితుడికి రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది.

నాలుగో రోజూ ప్రశాంతంగా ఈఏపీసెట్ పరీక్ష



పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన ఈఏపీసెట్ ఇంజినీరింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. నాలుగో రోజు ఇంజినీరింగ్ స్ట్రీమింగ్‌కు సంబంధించి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు జరిగిన పరీక్షకు 192 మందికి గాను 186 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

క్రీస్తు పరిశుద్ధ అగ్ని సభల ర్యాలీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ రింగ్ సమీపాన మెస్సీయ హోలీ ఫైర్ మినిస్ట్రీస్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్న క్రీస్తు పరిశుద్ధ అగ్ని సువార్త స్వస్థత మహోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరుతూ క్రైస్తవులు ఆదివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంట సాగిన ఈ ర్యాలీ సభలు జరిగే ప్రాంతం వద్ద ముగించారు. ర్యాలీలో పాల్గొన్న మెస్సీయ హోలీ ఫైర్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు బ్రదర్ మధువిక్టర్‌పాల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి జరిగే ఈ సభలకు నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చి దేవుని వర్తమానాన్ని విని జీవితంలో మేలులు పొందాలన్నారు. ఈ సభలకు కర్నూల్‌కు చెందిన పాస్టర్ ఫ్రెడ్డి పాల్ హాజరై దేవుని వర్తమానాన్ని అందజేస్తారని తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



బంటుమిల్లి: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో పెడన నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ వి.చినబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వంతో ఆడుకోవాలని, ఆటలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) రూ.20 వేలు, రెండో విజేతకు ఎంపీపీ చినబాబు రూ.10 వేలు, మూడో విజేతకు గ్రామ మాజీ సర్పంచి సీహెచ్ రాధాకృష్ణ రూ.5 వేలు ప్రకటించారు. మొదటి రోజు చెన్నూరు, చేవేంద్ర జట్ల మధ్య పోటీ జరిగింది. ఇప్పటికి 16 టీంలు నమోదైనట్లు, పోటీలో పాల్గొనే జట్లు 98662 11315 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.